వాగు కష్టాలు తీరేదెన్నడో..?

- పారుపల్లి-సారగండ్లగూడెం గ్రామాల మధ్యలో ఉన్న పెద్దవాగు
- వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో ఇబ్బందులు
- వరదొస్తే ఇరుగ్రామాల మధ్య రాకపోకలు బంద్
- వంతెన నిర్మించాలని రైతుల వేడుకోలు


పారుపల్లి- సారగండ్లగూడెం గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు (ఫైల్)

ఆత్మకూరు(ఎం): మండలంలోని సారగండ్లగూడెం - పారుపల్లి గ్రామాల మధ్య పెద్దవాగు ఉంది. వాగు ఇరువైపులా రెండు గ్రామాలకు చెందిన రైతుల భూములున్నాయి. నిత్యం రైతులు, కూలీలు ఈ వాగు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో ఈ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు దాటలేని పరిస్థితి ఉంటుంది. ఏటా వానాకాలంలో మూడు, నాలుగు నెలలు ఇరుగ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే ప్రజలకు, రైతులకు సౌకర్యవంతంగా ఉంటుందని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఇరుగ్రామాల ప్రజలు వాపోతున్నారు.

తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు..

సారగండ్లగూడెం - పారుపల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగుకు ఇరువైపులా రెండు గ్రామాలకు చెందిన రైతుల భూములున్నాయి. అయితే పెద్ద వాగు గుండా రాకపోకలు సాగించేందుకు ఇరు గ్రామాల ప్రజలు కలిసి కొంత డబ్బును జమ చేసి తాత్కాలికంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. వాగు ప్రవహించిన ప్రతిసారి ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా తాత్కాలిక మట్టిరోడ్డును ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానాకాలం వస్తే ఇబ్బందే...

మండలంలోని సారగండ్లగూడెం గ్రామస్తులకు వానాకాలం వస్తే ఇబ్బందులు తప్పడం లేదు. ఈ గ్రామ ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవడానికి వాగు దాటి పారుపల్లి గ్రామం మీదుగా 15 కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అయితే వర్షాలు వచ్చి వాగు పొంగితే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో సారగండ్లగూడెం గ్రామస్తులు మోత్కూరు మీదుగా 25 కిలో మీటర్లు ప్రయాణం చేసి ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చేరుకోవాల్సి వస్తుండడంతో ఆ గ్రామ ప్రజలకు వానాకాలంలో మండల కేంద్రానికి చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అయితే గతంలో పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని ఆర్అండ్‌బీ అధికారులు వాగులో సర్వే చేశారు. మట్టి నమూనాలను కూడా సేకరించారు. అయితే ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మాణ పనులు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి ఇరుగ్రామాల ప్రజలు ఇబ్బందులు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



వర్షాకాలంలో మా గ్రామం నుంచి మండల కేంద్రానికి చేరుకోవడానికి పెద్దవాగు అడ్డుగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. వాగుపై బ్రిడ్జి నిర్మించి ఇరుగ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను పలుమార్లు వేడుకున్న ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైన స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నాం

– కల్వల కాశయ్య, సారగండ్లగూడెం

మట్టిరోడ్డు నిర్మించుకున్నాం



వాగుకు అవతలి వైపు మా గ్రామానికి చెందిన రైతుల భూములున్నాయి. రైతులందరం క లిసి పెద్ద వాగుపై మట్టి రోడ్డు తాత్కాలికంగా నిర్మించుకుని రాకపోకలు సాగిస్తున్నాం. వాగు పొంగితే మట్టి రోడ్డు కూడా కొట్టుకుపోతుంది. దీంతో వాగు అవతలి వైపు ఉన్న వ్యవసాయ భూములకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం.

– కంసాని మాధవరెడ్డి, పారుపల్లి

వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



సారగండ్లగూడెం-పారుపల్లి మధ్య పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలి. గ్రామస్తులు రోడ్డు, రవాణ సౌకర్యం లేక అనేక ఇబ్బ ందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నాం.

– సారగండ్ల చలమయ్య, సారగండ్లగూడెం

జమిలి ఎన్నికలను తిప్పికొట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న కొండమడుగు నర్సింహ

భువనగిరి రూరల్ : ఒక దేశం ఒకే ఎన్నిక పేరుతో మోదీ ప్రభుత్వం ముందుకు తెస్తున్న ప్రమాదకరమైన ఎత్తుగడలను ప్రజలందరూ వ్యతిరేకించి ఐక్యంగా తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. మండలంలోని హన్మాపురం గ్రామంలో సీపీఎం మహాసభను ఆదివారం ఆ గ్రామ నాయకుడు బండి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు, శాసనసభ, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న కోవింద్ కమిటీ సిఫారసులు అమలు జరిగితే ప్రజాస్వామ్యం దెబ్బతింటుందన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన సమైక్యవాదంపై దాడి తప్పా మరోటి కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, రాచమల్ల నర్సింహ, పొందాల మైసయ్య, మోటి ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ దయ్యాల లక్ష్మి, సభ్యులు దయ్యాల మల్లేశ్, మాణిక్యం, తోటకూరి ఐలయ్య, కుసుమ మాధవ్, రంగ సాయినాథ్, బాల్ద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవలకు మారు పేరు వాసవీ క్లబ్

భువనగిరి రూరల్ : సేవలకు మారు పేరు వాసవీ క్లబ్ అని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ వైస్ ప్రెసిడెంట్ మల్టీఫుల్ ముక్త శ్రీనివాస్, జిల్లా పరిశీలకులు కలకోట లక్ష్మయ్య అన్నారు. మండలంలోని వడాయిగూడెంలోని వాసవీ నిత్యాన్నదాన సత్రంలో ఆదివారం నిర్వహించిన మంచాల రీకాస్ మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంచాల ప్రభాకర్, పాలకుర్తి వేణుమాధవ్, బల్లి సోమశేఖర్, రామకృష్ణ, నూనె కిశోర్ కుమార్, శ్రీనివాస్, సంతోష్ కుమార్, నవీన్ కుమార్, నూనె వెంకటేశ్వర్లు, శ్రీధర్, రాములు, జిడీగం లక్ష్మయ్య, చంద్రశేఖర్, నాగేందర్, కరుణ సాగర్, చందా మహేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఉద్యమకారుల సంఘం నాయకులు

భువనగిరి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గందమల్ల మల్లమ్మ అన్నారు. ఆదివారం పట్టణంలోని వినాయక చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అధ్యక్షతన జరగనున్న సభకు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ కోదండరాం హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోగు అంజయ్య, సత్తయ్య, సిరిపంగ గణేష్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

వలిగొండ : మండలంలోని సంగెం గ్రామంలో ఆదివారం స్నేహ యూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు ప్రకాశ్, ఉపాధ్యక్షులుగా కొమిరె కిరణ్, సంగెం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా వెలువర్తి ప్రవీణ్, కోశాధికారిగా దుబ్బ ప్రకాష్, కార్యదర్శిగా నకిరేకంటి భానుప్రసాద్, కమిటీ సభ్యులుగా మహేష్, మధు, తరుణ్ నరేష్, రాజు, కృష్ణస్వామి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని చొల్లేరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1999–2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు చిన్నం శ్రీను, దడిగె మధు, మచ్చ విఘ్నేశ్వర్, మహేందర్, గోపాల్, మల్లేష్, శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


భువనగిరిరూరల్ : సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న పట్నం శ్రీనివాస్

భువనగిరి రూరల్ : బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల సభ్యత్వ ఇన్‌చార్జ్ పట్నం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో బూత్ లెవల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ సిద్ధాంతాలను వివరించి సభ్యత్వం అడగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్యాసాని శ్రీనివాస్ యాదవ్, కొల్లూరి రాములు, సత్యనారాయణ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని పాముకుంట, నెమిల, రఘునాథపురం, సింగారం, చల్లూరు తదితర గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వాని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దాచపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్, నాయకులు వినోద్, దాచపల్లి శ్రీనివాస్, లక్ష్మణ్, బూర్గు శేఖర్‌రెడ్డి, సురేష్, రామచంద్రం, కర్ణాకర్, పెంట నాగరాజు, రంగ నరేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మోత్కూరు : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అన్నారు. ఆదివారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో మహిళా కాంగ్రెస్ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ సంఘం మండల అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ , పట్టణ అధ్యక్షురాలు అన్నెపు పద్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను గడప గడపకు చేరే విధంగా చూడాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మోత్కూరు : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో జరిగిన సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పైళ్ల యాదిరెడ్డి, నాయకులు చింతల కృష్ణారెడ్డి, నంద్యాల ఉపేందర్‌రెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా యాదగిరి

మోత్కూరు : మున్సిపల్ పరిధిలోని కొండగడప గ్రామంలో ఆదివారం సీపీఎం గ్రామ శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శిగా లెంకల యాదగిరిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలి

బొమ్మలరామారం : వరంగల్ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి కాటం ఐలేష్ కుమార్ అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన భారతీయ కిసాన్ సంఘ్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా తుమ్మల ఉపేందర్, కార్యదర్శిగా వనం రవీందర్, సహాయ కార్యదర్శిగా మాచన్నగారి చంద్రారెడ్డి,సభ్యులు ఉప్పల పెంటారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ సాదినేని రవీందర్, సహ ప్రముఖ్ వంగేటి అంజిరెడ్డి, కాశమైన ఆనందులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి


రోడ్డుపై పారుతున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని భీమనపల్లి గ్రామంలో డ్రెయినేజీలు నిర్మించి మురుగునీరు రోడ్డుపై రాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కోట రాంచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రోడ్డుపై పారుతున్న మురుగునీటిని పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు మంచాల మధు, కల్యూరి భిక్షపతి, తిరమలేశ్, శ్రీధర్, అశోక్, వెంకటేశ్, బలరాజు, ప్రభాకర్, శ్రీను, అభినందు, ఐలయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణం


భూదాన్‌పోచంపల్లి : దళిత సంఘం నాయకులకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం దారుణమని.. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని భీమనపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దళిత సంఘాలు చేపట్టి ధర్నాకు ఎమ్మెల్యే మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. సమాజంలో శాంతి, సామరస్యాన్ని దెబ్బతీసే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. విగ్రహం మరమ్మతులను చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మీసాల గణేశ్, బహుజన ప్రజాశక్తి రాష్ట్రకన్వీనర్ నల్ల లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ దుబ్బ రామకృష్ణ, మండల కన్వీనర్ బస్వయ్య, కొండమడుగు రాజు, రమేశ్, కలకొండ లింగస్వామి, చెరుకు మధు, ఓంప్రసాద్, మీసాల ప్రకాశ్, ప్రవీణ్, నరేశ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

భువనగిరిటౌన్ : భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ పలువురు నాయకులు ఆదివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ మాట్లాడుతూ దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈరపాక నర్సింహా, దర్గాయి హరిప్రసాద్, శివలింగం, ఇటుకల దేవేందర్, అన్నంపట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని జై భీమ్ సేన కమిటీ మండల అధ్యక్షుడు వల్లమల్ల రత్నయ్య అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహంపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి


ఆత్మకూరు(ఎం): గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


భూదాన్‌పోచంపల్లి : లడ్డును అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఆత్మకూరు(ఎం): ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని రహీంఖాన్‌పేటలో లెవన్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లా శేఖర రెడ్డి, డైరెక్టర్లు నోముల వెంకట్‌రెడ్డి, తాల్లపెల్లి స్వామి, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కప్పె శ్రీశైలం, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని యువజన జేపీసీ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణపతి శోభాయాత్రను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో స్వామివారి 39 కిలోల భారీ లడ్డూను డాక్టర్ జాలిగం సురేశ్, సిల్క్ శాలువాను దేవరాయ సుధాకర్ రూ. 31,116లకు దక్కించుకున్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాద్గుల ప్రభాకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు కర్నాటి రవి, గుండు మధు, దేవరాయ కుమార్, జేపీసీ నాయకులు భోగ కిరణ్, శంకర్, మధు, రాజు, శ్రీశ్రీ, పాండు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.25లక్షలు పలికిన గణపతి లడ్డూ

గాంధీనగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి లడ్డూను ఉప్పల్‌కు చెందిన గంజి కృష్ణ రూ.2లక్షల 25వేలకు దక్కించుకున్నాడు. అనంతరం 51 రకాల ప్రసాదాలతో స్వామివారికి నైవేద్యంగా సమర్పించి శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో అంకం వినోద్, కౌన్సిలర్ మోటి రజితరాజు, అంకం యాదగిరి, గునిగంటి మల్లేశ్, చేరాల నర్సింహ, బోడ సత్యనారాయణ, సాయి, శివ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దంతూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోదాసు చిన్నఈదయ్య తండ్రి బోదాసు నర్సింహ మృతి చెందాడు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ఆదివారి నర్సింహ మృతదేహానికి సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా పోచంపల్లికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు జింకల కుమార్ తల్లి సుగుణమ్మ మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. జిబ్లక్‌పల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన యువకుడు పబ్బతిగాని ప్రవీణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రవీణ్‌చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్‌నాయకుడు కొండూరు వెంకటయ్య తండ్రి రాములు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పాక మల్లేశ్, సామ మోహన్‌రెడ్డి, మన్నెం వెంకట్‌రెడ్డి, దోటి కుమార్, లింగస్వామి, శంకరయ్య, కొట్టం కరుణాకర్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత

భువనగిరి రూరల్ : మండలంలోని సురేంద్రపురిలోని వాసవి అన్నదాన సత్రంలో ఆదివారం ఆర్య వైశ్య మహాసభను నిర్వహించారు. ఆగిరి వెంకటేశ్, సరబు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీబీనగర్‌కు చెందిన మల్లగారి శ్రీనివాస్‌ను ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, సంతోష్ కుమార్, రాములు, నోముల నవీన్ పాల్గొన్నారు.

మార్కెట్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌కు సన్మానం

మోత్కూరు : ఆలేరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ చైర్‌పర్సన్‌గా అయినాల చైతన్య, వైస్ చైర్మన్‌గా పచ్చిమట్ల మదార్ గౌడ్‌లు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బుంగపట్ల యాకయ్య శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

నవంబర్ 14నుంచి కంఠమహేశ్వరస్వామి వేడుకలు

చౌటుప్పల్ : పట్టణంలో గౌడ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు చింతకింది అంజయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కంఠమహేశ్వర స్వామి బోనాలోత్సవం, కల్యాణ మహోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. నవంబర్ 14, 15, 16 తేదీల్లో వేడుకలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో లక్ష్మయ్య, వెంకటేశం, శ్రీనివాస్, ఎంఎస్‌గౌడ్, బాబు, జంగయ్య, రమేష్, మల్లేష్, చంద్రయ్య, ఎల్లయ్య, బాలకృష్ణ, శ్రీను, రవి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

భవన శిథిలాలు తొలగించరూ..


వ్యవసాయ కార్యాలయంలో పోసిన భవన శిథిలాలు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా నిర్మించే క్రమంలో ఆస్పత్రిలోని పాత భవనాలను తొలగించారు. తొలగించిన భవన శిథిలాలను పక్కనే ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలోని ఖాళీ స్థలంలో పోశారు. కొన్ని నెలలుగా ఆ భవన శిథిలాలు తొలగించకపోవడంతో ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలు పెరిగి పాములకు, తేళ్లకు ఆవాసాలుగా మారాయి. నిత్యం వ్యవసాయ కార్యాలయంలోకి పాములు వస్తుండడంతో వ్యవసాయాధికారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆయా శిథిలాలను ఎప్పుడో తొలగించాల్సి ఉన్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని పలువురు వాపోతున్నారు. పలుమార్లు భవన శిథిలాలను తొలగించాలని విన్నవించిన పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన వ్యవసాయ శాఖ కార్యాలయం ప్రాంగణంలో పోసిన భవన శిథిలాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

భువనగిరిటౌన్ : మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని జలీల్ పుర మసీద్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏఆర్ గార్డెన్ లో సోమవారం ముస్లిం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మహ్మద్ సుజావుద్దీన్, వలిబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం మహిళా ప్రతినిధులు ధార్మిక ప్రసంగాలు, ముస్లిం మతపరమైన గీతాలాపన, మహమ్మద్ ప్రవక్త యొక్క ఆసారే ముబారక్ ప్రదర్శన ఉంటాయన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

అడ్డగూడూరు : మండలానికి చెందిన పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శేశగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం


కాలనీవాసులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కాలనీవాసులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. లింగోజిగూడెంలోని చింతకుంట పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, సిబ్బంది మహబూబ్ అలీ, మహేష్, కుమారస్వామి, బుచ్చిరాములు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని బీసీకాలనీలో హైదరాబాద్‌లోని నీలమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం మున్సిపల్ వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి ప్రారంభించారు. వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

బెల్టు షాపులను మూసి వేయించాలి

గుండాల : బెల్టు షాపులను మూసీవేయించాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దపడిశాల గ్రామంలో ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లెబోయిన బాలయ్య అధ్యక్షత న నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సత్యనారాయణ, ఎండీ.ఖలీల్, అంజయ్య, శాఖాపురం యాకన్న పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం

రాజాపేట : మండలానికి చెందిన ఆలేరు మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లు సిలివేరు బాలరాజు గౌడ్, మాలోతు విఠల్ నాయక్‌లను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బుడిగె పెంటయ్య గౌడ్, మహేందర్ గౌడ్, దూదివెంకటాపురం గ్రామానికి చెందిన చిమ్మి సత్యనారాయణ, రమేష్, యాదేష్ ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి రూరల్ : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ సుక్క స్వామి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్ యాదవ్, రావి సురేష్ రెడ్డి, కర్ణాకర్, జమాల్, సాయికుమార్, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని వినతి

ఆలేరురూరల్ : ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం ఆలేరుకు వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీరేశం, జనార్ధన్, వెంకటేష్, బాంబే రవి, సహదేవ్, ఇక్కిరి కుమార్, చంద్రశేఖర్, రవి, నర్సింహులు, ప్రకాశ్, అంజిబాబు పాల్గొన్నారు.

బండారు జంగయ్యకు నివాళి

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని పద్మశాలీ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు బండారు జంగయ్య (65) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృత దేహాన్ని ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహ్మారెడ్డి, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పోచం భిక్షపతి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి రూ.2500 ఆర్థికసాయం అందజేశారు. మృతుడికి సొంతిల్లు లేక పోవడంతో చేనేత సహకార సంఘం వద్ద మృత దేహాన్ని ఉంచి ఆ సంఘం ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో కన్నయ్య, ప్రసాద్, యాదగిరి, రవీందర్, లక్ష్మణ్, రాములు, నర్సయ్య పాల్గొన్నారు.